క్లుప్తంగా

250 మందికి వైద్య పరీక్షలు


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు: పొద లింగయ్య జ్ఞాపకార్థం అతని కుమారుడు, ఎంపీటీసీ పొద పవన్ ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం మండలంలోని అగ్రహారం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆస్పత్రి ప్రతినిధి రఫీ, కంటి విభాగం వైద్యులు హైందవి, జనరల్ వైద్యులు రామాంజనేయులు పాల్గొని సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రోగ నిర్ధారణ జరిగిన 45 మందికి ఉచితంగా మెరుగైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డి.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బుడుంగుంట విజయ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో పలు రంగాల అభ్యున్నతిపై సమీక్షించనున్నట్టు చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఎవరికీ మినహాయింపు, సెలవులు అంగీకరించబడవని స్పష్టం చేశారు. ఎవరైనా గైర్హాజరైతే చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్టు తెలిపారు.

చిరువ్యాపారులను కొనసాగించాలి

ఒంగోలు సిటీ: ఒంగోలు దామోదర్ సంజీవయ్య కొత్త కూరగాయల మార్కెట్‌లో రోజువారీగా కూరగాయలు అమ్ముకుని జీవించే చిరువ్యాపారులను యథావిధిగా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం చిరువ్యాపారులతో వెళ్లి కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి కమిషనర్‌ను పిలిపించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ తరతరాలుగా జీవనాధారంగా ఉన్న కూరగాయల వ్యాపారాన్ని రద్దు చేస్తే వీధులపాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు చర్యలు లేకుండా ఒక్కసారిగా వీధులపాలు చేయడం సరికాదని కలెక్టరుకు విన్నవించారు. కలెక్టరు స్పందించి సానుకూలంగా స్పందించి ఏర్పాట్లు చేయమని కమిషనర్‌కు సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కొత్తపట్నం ఎంపీటీసీ వెంకటరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, భాస్కరు తిరుపతమ్మ, గురవమ్మ, తదితరులు ఉన్నారు.

కాసుల సర్వే..!



- సంతనూతలపాడు మండలంలో గ్రామ సర్వేయర్ల వసూళ్ల దందా
- చేతిలో లంచం పడనిదే పనిచేయని వైనం
- ఉన్నతాధికారులు చెప్పినా లెక్కలేదు
- ముడుపులివ్వకపోతే ముప్పతిప్పలు
- చేసేది లేక అడిగినంతా సమర్పించుకుంటున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

సంతనూతలపాడు: సర్వే, భూ రికార్డుల శాఖకు చెందిన సర్వేయర్లు వసూల్ రాజాలుగా మారారు. లంచాలు పుచ్చుకోవడంలో మండల సర్వేయర్లను సైతం గ్రామ సర్వేయర్లు మించిపోయారు. కొందరు గ్రామ సర్వేయర్లు పనులపై వచ్చిన వారి నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. కొలతలు వేయాలంటే చేతిలో కాసులు పడాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. లేదంటే భూ యజమానికి చుక్కలు చూపిస్తూ ముప్పతిప్పలు పెడుతున్నారు. ఉదాహరణకు.. మండలంలోని ఒక గ్రామంలో పేరుమోసిన నాయకునికి రెండెకరాల పొలం ఉంది. దాన్ని సర్వే చేసేందుకు ఇటీవల ఆ గ్రామ సర్వేయర్ వద్దకు ఆ నాయకుడు వెళ్లాడు. అందుకోసం రూ.10 వేలను ఆ సర్వేయర్ డిమాండ్ చేశాడు. పొలం పక్కనే తమకు 26 సెంట్ల స్థలం కూడా ఉందని, దాన్ని కూడా సర్వే చేయాలని కోరగా, సదరు సర్వేయర్ స్పందించలేదు. దీంతో ఆ శాఖ అధికారి ద్వారా సర్వేయర్‌కు ఆ నాయకుడు ఫోన్ చేయించగా, పొలం వద్దకు వచ్చి మళ్లీ అదనంగా లంచం డిమాండ్ చేశారు. అధికారి ఫోన్ చేసి చెప్పినప్పటికీ.. అడిగినంతా ఇచ్చిన తర్వాతే సర్వే చేశాడు. ఇలాంటి సంఘటనలు మండలంలోని గ్రామాల్లో నిత్యకృత్యంగా మారాయి. పార్టీ ఏదైనా.. పని కోసం వచ్చేవారు ఎవరైనా తమకు సంబంధం లేదని, చేయితడిపితేనే పని చేస్తామని చెప్పకనే చెబుతున్నారు సంతనూతలపాడు మండలంలోని గ్రామ సర్వేయర్లు. వారు అడిగినంతా ఇచ్చుకోలేని నిరుపేదలు, రైతులను రోజుల తరబడి తిప్పుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇష్టారాజ్యంగా సర్వేయర్లు...

సంతనూతలపాడు మండలంలో మొత్తం 18 పంచాయతీలు ఉండగా, 15 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయానికి ఒక గ్రామ సర్వేయర్ చొప్పున 15 మంది సర్వేయర్లు పనిచేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే అన్ని సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పైస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ పక్కాగా పర్యవేక్షించడంతో సచివాలయ ఉద్యోగులంతా ఎంతో క్రమశిక్షణగా ప్రజలకు సేవలందించారు. ఎక్కడా అవినీతి అక్రమాలకు తావులేకుండా పనిచేశారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతా అవినీతిమయంగా పరిపాలన మారడంతో యథారాజా..తథా ప్రజా అన్నట్టుగా పరిస్థితి నెలకొంది. సచివాలయ వ్యవస్థపై పర్యవేక్షణ లేకపోవడంతో వారంతా క్రమంగా అవినీతి అక్రమాలను పెంచుకుంటూ పోతున్నారు. అందులో భాగంగానే గ్రామ సర్వేయర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సర్వే చేయాలని స్వయంగా ఆ శాఖ ఉన్నతాధికారులు ఫోన్ చేసి చెప్పినా మాది మాకు ఇవ్వాల్సిందే అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. మేము ఎవరి మాటా వినం.. ఈ విషయంలో తగ్గేదేలే అనే రీతిలో రెచ్చిపోతుతున్నారు. గతంలో మండల సర్వేయర్లదే పెత్తనం ఉండేది. కానీ, ప్రస్తుతం గ్రామ సర్వేయర్ల వ్యవస్థ పేట్రేగిపోతోంది. గ్రామంలో పొలం లేదా స్థలం సర్వే చేయాలన్నా వీరిని సంప్రదించాల్సి వస్తోంది. ఇదే అదునుగా భావించి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ఏసీబీకి చిక్కినా మారని తీరు...

గతంలో చాలా మంది సర్వేయర్లు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఓ స్థలాన్ని సర్వే చేసిన తర్వాత అందుకు సంబంధించిన రిపోర్ట్ ఇచ్చేందుకు ఓ వ్యక్తి నుంచి ఏకంగా లక్షల్లో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కి చట్టపరమైన చర్యలను కూడా ఓ సర్వేయర్ ఎదుర్కొంటున్నారు. అయినా సర్వేయర్ల తీరు మారడం లేదు. ప్రజలను ఇక్కట్లకు గురిచేస్తూ లంచాల కోసం పట్టిపీడిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమార్కులతో చేతులు కలిపి అడ్డదిడ్డంగా కూడా సర్వేలు...

కొన్నిరకాల భూముల సర్వే పనులను అడ్డం పెట్టుకుని సర్వేయర్లు కాసులకు కక్కుర్తిపడి అడ్డదిడ్డంగా కూడా సర్వేలు చేసి తప్పుడు రిపోర్టులు కూడా ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సర్వే కోసం మీ సేవ కేంద్రంలో చలానా కట్టి దరఖాస్తు చేసుకుంటే 45 రోజుల్లోపు సర్వే చేసి సమస్య పరిష్కరించాలి. అయితే, సర్వేయర్లు నిర్ణీత వ్యవధిలో సర్వే చేయకుండా ప్రజలను తిప్పుకుంటున్నారు. లంచమిస్తేనే సర్వే చేయడం అనేది సర్వసాధారణంగా మారిపోయింది. దానికితోడు వివాదాస్పద స్థలాలను సర్వే చేయాల్సి వస్తే వీరి దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఇలాంటి వ్యవహారాల్లో అవకాశం దొరికితే దరఖాస్తుదారుడిని పిండేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డిమాండ్ చేసినంత ఇవ్వకపోతే అతని ప్రత్యర్థితో చేతులు కలిపి అసలైన అర్జీదారులకు నష్టం కలిగేలా రిపోర్టులిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు కూడా కొన్ని వెలుగుచూస్తున్నప్పటికీ.. గ్రామ సర్వేయర్ల అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

> **ప్రజలు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**
>
> పొలాలు, స్థలాలు సర్వే చేసేందుకు, సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు ఎవరైనా సర్వేయర్లు డబ్బులు డిమాండ్ చేస్తే బాధితులు నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు. అవినీతికి పాల్పడినట్లు తేలితే సర్వేయర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.
>
> – చాన్ బాషా, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే, భూ రికార్డుల శాఖ

ఒంగోలు తాలూకా సీఐపై ఐజీకి ఫిర్యాదు

ఒంగోలు సిటీ: దళిత బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి సోదరుడిపై దాడి చేసిన జులాయి గ్యాంగ్‌పై కేసు నమోదు చేయలేదని ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ అజయ్‌కుమార్‌పై గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి మాలమహానాడు నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. వార్షిక తనిఖీ నిమిత్తం ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఐజీతో మాలమహానాడు నాయకులు దారా అంజయ్య, కాకుమాను రవి మాట్లాడుతూ కేశవరాజుకుంటలో దళిత బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వారిపై మూడు రోజులుగా తాలూకా సీఐ అజయ్‌కుమార్ కేసు కట్టలేదన్నారు. మేలం శాంతివర్ధన్ అనే యువకుడు ఆరో తరగతి చదువుతున్న తన చెల్లెలు స్కూలుకు వచ్చిపోయే సమయంలో, చిల్లర కొట్టుకు వెళ్లే సమయంలో కొందరు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తెలిపాడు. తన చెల్లెలి చున్నీ లాగడం, చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించడం చేశారన్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే.. డ్యూటీలో ఉన్న తాలూకా సెక్టార్-3 ఎస్సై అనిత మీరే కొట్టి మళ్లీ వాళ్లపై ఫిర్యాదు చేయడానికి వచ్చారా..? అంటూ ప్రశ్నించినట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు తీసుకోకపోగా, బాధితులనే బెదిరించడంతో.. బాధితులు దళిత నాయకుడు నీలం నాగేంద్రంను ఆశ్రయించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సీఐ అలసత్వ వైఖరిపై మాల మహానాడు నాయకులు ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆ సంఘటనపై కేసు నమోదు చేసి విచారించాలని ఐజీ ఆదేశించారు.


ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి ఫిర్యాదు చేస్తున్న మాలమహానాడు నాయకులు

భక్తిశ్రద్ధలతో భావనారుషి తిరునాళ్లు


ఆలయం వద్దకు ఊరేగింపుగా వస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు


స్వామివారి ఆలయం వద్దకు 108 కలశాలతో వస్తున్న మహిళా భక్తులు


భక్తులకు దర్శనమిస్తున్న భద్రావతి, భావనారుషి స్వామివార్లు

చీమకుర్తి: పద్మశాలీయుల కుల దైవం భద్రావతి సమేత భావనారుషి స్వామి తిరునాళ్లను సోమవారం చీమకుర్తిలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న తిరునాళ్లలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చీమకుర్తి మెయిన్‌రోడ్డులోని భద్రావతి సమేత భావనారుషి ఆలయంలోని స్వామివార్లను నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం 108 కలశాలతో గాంధీనగర్‌లోని శ్రీకోదండరామస్వామి ఆలయం నుంచి భావనారుషి ఆలయం వరకు మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా వచ్చారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొంతు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జట్ల మురళీధర్, కమిటీ నిర్వాహకులు తాటికొండ వెంకట సుబ్బారావు, వాసి వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, దొంతు సోమయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని శ్రీ సీతలాంబ బొడ్డు రాయి అమ్మవారు, చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వి.నాగసాయి, కృష్ణశర్మ ఆధ్వర్యంలో సంతనూతలపాడులోని నాలుగు దిక్కుల గౌడు రాళ్ల వద్ద అభిషేకాలు, పూజలు చేశారు. బొడ్డు రాయి వద్ద నాగసాయి, కృష్ణశర్మ, సహాయక బొడ్డు రాయి పూజారి నలగట్ల రాజబాబు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని బొడ్డు రాయి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు వేమా మల్లేశ్వరరావు, చెరుకూరి వెంకటసుబ్బయ్య, నంద్యాల రామయ్య, తదితరులు పర్యవేక్షించారు. జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి దంపతులు, గ్రామ నాయకులు చెరుకూరి బోసు, సాధినేని వెంకట్రావు, భువన్న శీను, కే నాగాంజనేయులు, కే అంకులు, ఎస్.తిరుమలరావు, వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, రామాంజనేయులు, వల్లపు శీను తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ప్రజలు

ఈదుమూడిలో ప్రపంచ చిత్తడి నేల దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నాగులుప్పలపాడు: భూమిపై ప్రాణకోటి మనుగడకు చిత్తడి నేలలు ముఖ్యమని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ కాకి స్వర్ణలత అన్నారు. సోమవారం మండలంలోని ఈదుమూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రపంచ చిత్తడి నేల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ నీటి వనరులు, మంచినీటికి అనుకూలంగా ఉన్న చిత్తడి నేలలు భూమి ఉపరితలం నుంచి వ్యర్థాలను వడపోస్తాయని తెలిపారు. గ్రీన్ టీచరు ఎస్.కల్పనకుమారి మాట్లాడుతూ చిత్తడి నేలలతో ఉపయోగాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు పి.శంకరరావు మాట్లాడుతూ చిత్తడి నేలల పరిరక్షణ మన భవిష్యత్తుకు రక్షణ అని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.సాంబశివరావు, జి.శ్రీనివాసరావు, కె.శంకరరావు, బి.శ్రీనివాసరెడ్డి, ఎం.బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి


గిద్దలూరు పోలీసుస్టేషన్‌లో వాహనాలు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్


కంభం సర్కిల్ కార్యాలయంలో మహిళా పోలీసులకు హెల్మెట్లు అందజేస్తున్న ఎస్పీ

గిద్దలూరు రూరల్/రాచర్ల/కంభం/కొమరోలు/అర్థవీడు/మార్కాపురం: గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. చట్టం అందరికీ సమానమేనని, పోలీసులు చట్టానికి లోబడి పనిచేయాలని స్పష్టం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం ఆయన గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, అర్థవీడు, మార్కాపురం పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లు, కంభం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చెప్పారు. పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోలీసులతోపాటు ప్రతి పౌరుడూ బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే సమాజంలో మంచి వాతావరణాన్ని తీసుకురాగలమన్నారు. గిద్దలూరు పోలీసు స్టేషన్ సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్స్‌ను తొలగించి కాంప్లెక్స్ నిర్మించేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. స్టేషన్ ప్రాంగణంలో ఉన్న సీజ్ చేసిన వాహనాలను వేలం వేయాలని ఆదేశించారు. అనంతరం నంద్యాల హైవేలో పోలీసు శాఖ ఖాళీ స్థలాన్ని పరిశీలించి పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ మోసాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, మహిళ భద్రత విషయంలో రాజీ పడకుండా పనిచేయాలని చెప్పారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. కంభంలో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించిన అనంతరం మహిళా పోలీసులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. దాతల సహకారంతో కొమరోలు పోలీసుస్టేషన్‌ను ఆధునీకరించగా సంబంధిత శిలాఫలకాన్ని ఎస్పీ ఆవిష్కరించారు. కొమరోలు మండలంలో 100 సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొమరోలుకు త్వరలోనే ఎస్సైని నియమిస్తామన్నారు. ముందుగా పోలీస్ స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటారు. మార్కాపురం పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లను ఎస్పీ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం సీసీ కెమెరాలను ప్రారంభించారు. నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐలు కె.సురేష్, రామకోటయ్య, మల్లికార్జునరావు, ఎస్సైలు సుదర్శన్ యాదవ్, నరసింహారావు, రవీంద్రారెడ్డి, మార్కాపురం సీఐ సుబ్బారావు, ఎస్సైలు అంకమ్మరావు, సైదులు, రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

ఒంగోలు సిటీ: జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వారి ఫిర్యాదులను పోలీస్ అధికారులకు అందించారు. ప్రతి ఫిర్యాదుదారునితో ముఖాముఖి నిర్వహించిన పోలీస్ అధికారులు.. వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడి వెంటనే చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, చీటింగ్, జాబ్‌ఫ్రాడ్, భూ వివాదాలు, ఇతర సమస్యల గురించి మొత్తం 54 ప్రజా ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సురేష్ బాబు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, సీసీఎస్ సీఐ జగదీష్, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ సుబ్బారావు, ఎస్సైలు రజియాసుల్తాన్, ప్రభాకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టిబాబు నియామకంపై హర్షం


చిట్టిబాబును సన్మానిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ మేధావుల కమిటీ అధ్యక్షునిగా డాక్టర్ యేజర్ల చిట్టిబాబు నియామకంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ నాయకులు ముద్దన ఉమామహేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కుమ్మూరి సుధాకర్, తదితరులు చిట్టిబాబును శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉసురుపాటి రాజు, పాలపర్తి ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాటమరాజు తిరునాళ్లకు ఏర్పాట్లు ప్రారంభం


భూమి పూజ చేస్తున్న పీఎల్‌పీ యాదవ్ తదితరులు

మార్కాపురం: మార్చి 29, 30వ తేదీల్లో అతిపెద్ద జాతర అయిన కాటంరాజు తిరునాళ్లకు ఏర్పాట్లను ప్రారంభించామని జాతీయ యాదవ క్రమశిక్షణ సంఘ చైర్మన్ పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ తెలిపారు. సోమవారం పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామ పరిధిలోని ఆలయం వద్ద ఏర్పాట్లను ప్రారంభించామని తెలిపారు. వివరాలను మార్కాపురంలో ఆయన మీడియాకు తెలిపారు. సుమారు 24 లక్షల రూపాయలతో భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రెండు రాష్ట్రాలకు సంబంధించి సుమారు 2 లక్షల మంది యాదవులు తిరునాళ్లకు రావచ్చని అంచనా వేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ వెంకట రాజు యాదవ్ తెలిపారు. పోలీసు, విద్యుత్, రెవెన్యూ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, వైద్యారోగ్యశాఖ అధికారులతో త్వరలో సమావేశమై వారి సహకారం తీసుకుంటామన్నారు. తిరునాళ్లను విజయవంతం చేసేందుకు యాదవులు సహకరించాలని కోరారు. ఇటీవలే రూ.50 లక్షలతో రోడ్ల మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.గంగరాజు, ఓ.నాగేశ్వరరావు, జి.సుబ్బారావు, జి.బాల నాగయ్య, బి.చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మేస్త్రీలను కొనసాగించాలి


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఒంగోలు సిటీ: నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగంలో గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న మేస్త్రీలను కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు సోమవారం ప్రజావేదిక కార్యక్రమంలో కలెక్టరు తమీమ్‌అన్సారియాను కలిసి వినతిపత్రం అంజేశారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరించాలని కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమారు 40 మంది మేస్త్రీలుగా పనిచేశారన్నారు. రాష్ట్రం మొత్తం అన్ని మున్సిపాలిటీలలో మేస్త్రీలు ఉన్నారన్నారు. ఒంగోలులోనే వీళ్లను ఆపారని, ఇప్పటికే నాలుగు నెలలు నుంచి జీతాలు లేక కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీనియార్టీని బట్టి వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కలెక్టరు తమీమ్ అన్సారియా స్పందిస్తూ 15 రోజులలో వారిని విధుల్లోకి తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎంఎల్ నారాయణ, ఆర్.వెంకటరావు, కందుల ఆదినారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, విజయ్‌వర్దన్, తదితరులు పాల్గొన్నారు.